# సెమీస్ సమరం

## నేడు భారత్, కివీస్ నాకౌట్ పోరు • ఫైనల్ బెర్తుపై ఇరు జట్ల దృష్టి • వన్డే ప్రపంచకప్ టోర్నీ

రోహిత్‌శర్మ

**ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌లో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. వాంఖడే వేదికగా ఆతిథ్య భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య సెమీస్ పోరుకు వేళయైంది. మెగాటోర్నీలో తొమ్మిదికి తొమ్మిది మ్యాచ్‌లు గెలిచిన జట్టు టీమ్‌ఇండియా అయితే..వరుసగా నాలుగు విజయాలతో దుమ్మురేపి ఆపై నాలుగు ఓటములతో ఆఖరి బెర్తు దక్కించుకున్న టీమ్ కివీస్. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ అజేయంగా సెమీస్ పోరులో నిలిచింది భారత్. ఇదే జోరులో కివీస్ భరతం పట్టాలని రోహిత్‌సేన మంచి కసి మీదుంది. సొంత ఇలాఖాలో ఎలాగైనా కప్ కలను తీర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా అందుకు తగ్గట్లు సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతున్నది. పన్నెండేండ్ల తర్వాత ప్రపంచకప్‌ను దక్కించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. సరిగ్గా నాలుగేండ్ల క్రితం మాంచెస్టర్‌లో ఇదే కివీస్ చేతిలో ఓటమి ఎదుర్కొన్న మనోళ్లు ప్రతీకారం తీర్చుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కోట్లాది మంది ఆశలను మోసుకుంటూ బరిలోకి దిగుతున్న భారత్..ప్రపంచకప్‌ను అందుకునేందుకు మరో రెండడుగుల దూరంలో ఉన్నది. మరి మన కల నెరవేరుతుందా లేదా అనేది కొన్ని గంటల్లో తేలనుంది.**

ముంబై: వన్డే ప్రపంచకప్‌లో అసలు సిసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. ఇన్ని రోజులు లీగ్ దశ మ్యాచ్‌లు అభిమానులకు ఆసక్తి కల్గించగా, నాకౌట్ పోరు మెగాటోర్నీని మరో రేంజ్‌కు తీసుకెళ్లనున్నాయి. చరిత్రాత్మక వాంఖడే స్టేడియం వేదికగా బుధవారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య కీలకమైన సెమీఫైనల్ పోరు జరుగనుంది. లీగ్ దశలో కివీస్‌ను చిత్తుచేసిన టీమ్‌ఇండియా అదే ఆత్మ విశ్వాసంతో మరోమారు విజయంతో ఫైనల్ బెర్తు దక్కించుకోవాలని చూస్తున్నది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో రోహిత్‌సేన అజేయంగా నిలువగా, కివీస్ ఐదు విజయాలు, నాలుగు ఓటములతో నాలుగో స్థానంతో నాకౌట్ రేసులో నిలిచింది. ప్రస్తుత టోర్నీతో కలిపి ఇప్పటి వరకు టీమ్‌ఇండియా ఎనిమిది సార్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఇందులో రెండుసార్లు(1983, 2011) ట్రోఫీ కైవసం చేసుకుంది. స్వదేశంలో చివరిసారి జరిగిన వన్డే ప్రపంచకప్‌లో మహేంద్రసింగ్ ధోనీ సారథ్యంలో తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది. మొహాలీ వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన సెమీస్ పోరులో భారత్ చరిత్రాత్మక విజయం సాధించింది. అయితే నాలుగేండ్ల క్రితం మాంచెస్టర్‌లో జరిగిన మెగా టోర్నీ సెమీస్‌లో కివీస్..టీమ్‌ఇండియాను నాకౌట్ చేసింది. గప్టిల్ డైరెక్ట్ హిట్‌తో ధోనీని రనౌట్ చేయడం మ్యాచ్ గతిని మార్చేసింది. జడేజా ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఇప్పుడు అదే కివీస్..మళ్లీ సెమీస్‌లో ఎదురైంది. ఇప్పుడు మన ముంబైలో న్యూజిలాండ్‌ను మట్టికరిపించే అవకాశం వచ్చింది. మెగాటోర్నీలో ఇప్పుడున్న జోరును టీమ్‌ఇండియా కొనసాగిస్తే మనల్ని అడ్డుకోవడం ఏ జట్టుకైనా అసాధ్యంగా కనిపిస్తున్నది.

### ముఖాముఖి

| | |
|---|---|
| ప్రపంచకప్ మ్యాచ్‌లు | 10 |
| భారత్ | 4 |
| న్యూజిలాండ్ | 5 |
| ఫలితం తేలనిది | 1 |
| ఓవరాల్‌గా | 117 |
| భారత్ | 59 |
| న్యూజిలాండ్ | 50 |
| ఫలితం తేలనిది | 7 |
| టై | 1 |

అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో మనోళ్లు దుమ్మురేపుతున్న వైనం ముచ్చటగా మూడో సారి కప్‌ను అందుకునేలా కనిపిస్తున్నది.

**జోరు సాగనీ:**

ఏ నిమిషానా ప్రపంచకప్ ప్రస్థానాన్ని భారత్ మొదలుపెట్టిందో గానీ అవిఘ్నంగా సాగుతున్నది. చెన్నైలో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాపై అద్భుత విజయంతో కదంతొక్కిన రోహిత్‌సేన..మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఆ తర్వాత వరుసగా అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ ఇలా అందరి భరతం పట్టింది. అటు బ్యాటింగ్ అయినా..ఇటు బౌలింగ్ అయినా కేక పుట్టిస్తూ పరాజయం అన్నది లేకుండా దూసుకెళుతున్నది. మెగాటోర్నీలో 594 పరుగులతో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అందరి కంటే టాప్‌లో కొనసాగుతుంటే కెప్టెన్ రోహిత్‌శర్మ(503) జోరు కనబరుస్తున్నారు. వీరిద్దరిలో ఏ ఒక్కరూ కుదురుకున్నా..కివీస్ పని అయిపోయినట్లే. బౌలింగ్ విషయానికొస్తే..లేట్‌గా వచ్చినా లేటెస్టుగా వచ్చినట్లు షమీ స్వింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. షమీకి తోడు సిరాజ్, బుమ్రా చెలరేగితే కివీస్‌ను ఓడించడం పెద్ద కష్టమేమి కాదు. జడేజా, కుల్దీప్‌యాదవ్ తమ స్పిన్‌తో వికెట్ల వేట కొనసాగిస్తున్నారు. మొత్తంగా మరో మారు సమిష్టి ప్రదర్శన కనబరిస్తే..మనకు అహ్మదాబాద్ టిక్కెట్ కన్ఫామ్ అయినట్లే.

విలియమ్సన్

**1 వన్డేల్లో 50 సెంచరీల మార్క్‌కు విరాట్ కోహ్లీ మరో సెంచరీ దూరంలో ఉన్నాడు. ప్రస్తుతం సచిన్ టెండూల్కర్(49)తో కలిసి సమంగా కొనసాగుతున్నాడు.**

### పడుతూ లేస్తూ

మెగాటోర్నీలో కివీస్ ప్రస్థానం పడుతూ లేస్తూ సాగుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించిన కివీస్..నెదర్లాండ్స్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌పై గెలిచి జోరు కనబరిచింది. ఆ తర్వాత వరుసగా భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ చేతుల్లో ఓటములు ఎదుర్కొంది. సెమీస్‌కు అర్హత సాధిస్తుందా లేదా అన్న అనుమానాల మధ్య మెరుగైన రనౌట్‌తో నాకౌట్‌లోకి ప్రవేశించింది. కెప్టెన్ విలియమ్సన్ తిరిగి జట్టులో చేరడం ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వగా నిలకడలేమి ఆ జట్టును కలవరపెడుతున్నది.

### జట్ల అంచనా

**భారత్:** రోహిత్‌శర్మ(కెప్టెన్), గిల్, కోహ్లీ, అయ్యర్, రాహుల్, సూర్యకుమార్, జడేజా, షమీ, కుల్దీప్‌యాదవ్, బుమ్రా, సిరాజ్.

**న్యూజిలాండ్:** విలియమ్సన్(కెప్టెన్), కాన్వే, రచిన్, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, చాప్‌మన్, సాంట్నర్, సౌథీ, ఫెర్గుసన్, బౌల్ట్.

## నాకౌట్‌కు పంకజ్, శ్రీకృష్ణ

న్యూఢిల్లీ : ఐబీఎస్ఎఫ్ ప్రపంచ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత మేటి ఆటగాడు పంకజ్ అద్వానీ, గత చాంపియన్ ఎస్.శ్రీకృష్ణ నాకౌట్ స్థాయికి చేరుకున్నారు. ఇరాన్‌కు చెందిన మాజీ చాంపియన్ అమీర్ సర్కోష్ కూడా నాకౌట్‌కు చేరుకున్నాడు. అద్వానీ తొలి రౌండ్లలో 4-1, 4-0తో విజయాలు నమోదు చేసుకుని గ్రూపులో అగ్రస్థానంలో నిలిచాడు. శ్రీకృష్ణ ఒక ఫ్రేమ్‌ను మాత్రమే కోల్పోయి నాకౌట్‌కు అర్హత సాధించాడు.

## అల్కారజ్‌కు ఆశాభంగం

ట్యురిన్ : ఏటీపీ ఫైనల్స్ టెన్నిస్ టోర్నీలో స్పెయిన్ యువ ఆటగాడు కార్లోస్ అల్కారజ్‌కు ఆశాభంగం ఎదురైంది. తొలి 8 ర్యాంక్‌లలో ఉన్న ఆటగాళ్ల మధ్య జరిగే ఈ టోర్నీలో 20 ఏళ్ల అల్కారజ్ సోమవారం జరిగిన తన తొలి మ్యాచ్‌లో 7-6(3), 3-6, 4-6 స్కోరుతో రెండుసార్లు టైటిల్ విజేత అలెగ్జాండర్ జ్వెరెవ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో మ్యాచ్‌లో డేనియల్ మెద్వెదెవ్ 6-4, 6-2తో ఆండ్రీ రుబ్లెవ్‌పై గెలుపొందాడు. రౌండ్‌రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో ప్రతి గ్రూపునుంచి అగ్రస్థానంలోని ఇద్దరు ఆటగాళ్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

## భారత పర్యటనకు ఆసీస్ మహిళా జట్టు

మెల్‌బోర్న్ : వచ్చే నెలలో భారత్‌లో పర్యటించే ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టులో స్టార్ కీపర్-బ్యాటర్ అలిస్సా హీలి, ఎడమచేతి పేసర్ లారెన్ చీతల్‌కు అవకాశం కల్పించారు. మెగ్ లానింగ్ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆమె స్థానంలో ఎవరు సారథ్యం వహిస్తారన్నది ఇంకా వెల్లడించలేదు. ఆస్ట్రేలియా జట్టు భారత జట్టుతో ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. మ్యాచ్‌లన్నీ ముంబైలోనే నిర్వహించనున్నారు. టి20లకు డివై పాటిల్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది.

## రజాక్ నోటి దూల | ఐశ్వర్యరాయ్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు

కరాచీ: పాకిస్థాన్ మాజీ క్రికెటర్ అబ్దుల్ రజాక్ వివాదంలో చిక్కుకున్నాడు. తన నోటి దూలతో వార్తల్లో వ్యక్తి అయ్యాడు. ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు ప్రదర్శనపై ఓ వార్తా సంస్థ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో షాహిద్ అఫ్రిదీ, ఉమర్ గుల్‌తో కలిసి పాల్గొన్న రజాక్..అనవసరంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఐశ్వర్య రాయ్‌ను లాగాడు. మెగాటోర్నీలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన గురించి మాట్లాడాల్సింది పోయి..ఐశ్వర్యపై చౌకబారు వ్యాఖ్యలు చేశాడు. 'గత కొన్ని రోజులుగా పీసీబీ ఉద్దేశం ఏంటో అర్థం కావడం లేదు. నేను ఆడే రోజుల్లో కెప్టెన్‌గా యూనిస్ ఖాన్ జట్టును అద్భుతంగా నడిపించేవాడు. యూనిస్‌తో పాటు సహచరుల నుంచి నేను స్ఫూర్తి పొందేవాడిని. కానీ ప్రస్తుతం జట్టులో అలాంటి పరిస్థితి లేదు. అసలు పీసీబీ ఏం చేస్తుందో తెలియడం లేదు' అని అన్నాడు. అంతటితో ఆగకుండా పీసీబీని విమర్శిస్తూ 'మీరు ఐశ్వర్యరాయ్‌ను పెండ్లి చేసుకుంటే మంచి పిల్లలు పుడుతారు అనుకుంటారు. కానీ ఎప్పటికీ అలా జరుగదు' అని అన్నాడు. రజాక్ తీరును అందరూ తీవ్రంగా ఎండగడుతున్నారు.

## సాత్విక్-చిరాగ్‌కు నిరాశ

కుమమోటో : జపాన్ మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జోడి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టిలకు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్-చిరాగ్ మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 21-16, 18-21, 16-21 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 21వ ర్యాంక్ జోడి లు చింగ్ యావో-యాంగ్ పో హాన్ చేతిలో ఓటమి చవిచూశారు. గత యేడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో చైనీస్ తైపీ జోడీని ఓడించిన భారత జోడి అదే జోరు కనబరచలేకపోయారు. పలుమార్లు ఆధిక్యం చేతులు మారిన నేపథ్యంలో ఎట్టకేలకు తైపీ జోడి గేమ్‌ను గెలుచుకుని సమఉజ్జీగా నిలిచింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆరు పాయింట్లవరకు నువ్వానేనా అన్నట్టు సాగినా... ఆపై తైపీ జోడికి ఎదురులేకపోయింది. సింగిల్స్‌లో ప్రణయ్, లక్ష్య సేన్, ప్రియాంశు రజవత్, పివి సింధు బుధవారం తమ పోరును ప్రారంభించనున్నారు.

## కేన్‌తో జాగ్రత్త: గవాస్కర్

ముంబై : ప్రస్తుత ప్రపంచకప్‌లో భారత పేస్ బృందం ప్రత్యర్థి ప్రధాన బ్యాటర్లను వణికిస్తుంటే, స్పిన్నర్లు మిడిల్ ఓవర్లలో పరుగులను నియంత్రిస్తున్నారు. కేన్ విలియమ్సన్ సారథ్యంలోని కివీస్‌కు అటువంటి పరిస్థితి ఎదురవుతుందని భావించడం లేదని మాజీ దిగ్గజ బ్యాటర్ సునీల్ గవాస్కర్ వ్యాఖ్యానించాడు. 'విలియమ్సన్ ఎటువంటి బౌలింగ్‌నైనా సమర్థంగా ఎదుర్కోగల దిట్ట. అతని ఫుట్‌వర్క్‌ను బౌలింగ్‌కు అనుగుణంగా మార్చుకుని పరుగులు రాబట్టగలడు. కుల్దీప్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు కేన్ సన్నద్ధంగా ఉంటాడు. ప్రతి బంతికి పరుగు రాబట్టేందుకు యత్నిస్తాడు. అతన్ని కట్టడి చేయగలిగితే విజయం మనదే' అని అన్నాడు.

## అథ్లెట్ అవార్డు రేసులో నీరజ్

న్యూఢిల్లీ: వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రేసులో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా దూసుకొచ్చాడు. మంగళవారం కుదించిన జాబితాలో నీరజ్ చోటు దక్కించుకున్నాడు. ప్రతిష్ఠాత్మక అవార్డు కోసం ఐదుగురు అథ్లెట్లతో కలిసి పోటీపడుతున్నాడు. నీరజ్ ఈ మధ్య కాలంలో నిలకడగా రాణిస్తూ ప్రతిష్ఠాత్మక టైటిళ్లు తన ఖాతాలో వేసుకుంటున్నాడు. ఇటీవల ఆసియాగేమ్స్‌తో పాటు వరల్డ్ అథ్లెటిక్స్ టోర్నీ, డైమండ్ లీగ్, కామన్వెల్త్ గేమ్స్‌లో సత్తాచాటుతున్నాడు. రానున్న పారిస్ ఒలింపిక్స్‌లోనూ పతకం గెలువాలన్న పట్టుదలతో ఉన్నాడు. అవార్డు రేసులో నీరజ్‌తో పాటు ర్యాన్ క్రౌజర్(అమెరికా), మోండో డుప్లాంటిస్(స్వీడన్), కెల్విన్ కిప్టమ్(కెన్యా), నోహ్ లైస్(అమెరికా) ఉన్నారు.

---

వాణిజ్య

## వైజాగ్ స్టీల్ ఆస్తులు అమ్మేస్తాం

సంస్థ సీఎండీ అతుల్ భట్

కోల్‌కతా, నవంబర్ 14: వైజాగ్ స్టీల్‌గా వ్యవహరించే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ఆస్తుల్ని విక్రయించడానికి మోదీ సర్కారు సిద్ధమైంది. కంపెనీకి వైజాగ్‌లో ఉన్న భూముల్ని, ఉత్తర ప్రదేశ్‌లో ఉన్న ట్రైన్ ఫోర్డ్ వీల్ ప్లాంట్‌ను విక్రయించి రూ.3,000-4,000 కోట్లు సమీకరిస్తామని ఆర్ఐఎన్ఎల్ సీఎండీ అతుల్ భట్ చెప్పారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఓ సదస్సులో భట్ మాట్లాడుతూ.. వచ్చే ఆదాయంతో సంస్థ రుణాన్ని తగ్గించి, వర్కింగ్ క్యాపిటల్‌ను సమకూర్చుకుంటామన్నారు. కాగా, ఆర్ఐఎన్ఎల్‌కు 6,000 ఎకరాల గ్రీన్‌బెల్ట్‌సహా మొత్తం 19,000 ఎకరాల భూములున్నాయి.

## ఒబెరాయ్ కన్నుమూత

న్యూఢిల్లీ, నవంబర్ 14: ఒబెరాయ్ గ్రూప్ గౌరవ చైర్మన్ పృథ్వీ రాజ్ సింగ్ ఒబెరాయ్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 94 ఏండ్లు. 1934లో సిమ్లాలో ఓ చిన్న హోటల్‌తో ప్రారంభమైన ఒబెరాయ్ ప్రస్థానం.. ఏడు దేశాలకు విస్తరించింది. ఒబెరాయ్ గ్రూప్‌ను రాయ్ బహదూర్ మోహన్ సింగ్ ఒబెరాయ్ ప్రారంభించారు. ఆపై దీన్ని పృథ్వీ రాజ్ సింగ్ ఒబెరాయ్ నడిపించారు. ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్, ట్రైడెంట్ హోటళ్లు, మైడెన్ హోటల్స్‌ను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

## ఎన్ఎండీసీ నికర లాభం రూ.1,025 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 14: ప్రభుత్వ రంగ ఖనిజ సంస్థ ఎన్ఎండీసీ నికర లాభం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 15.7 శాతం వృద్ధిచెంది రూ.1,024.86 కోట్లకు చేరింది. నిరుడు ఇదే కాలంలో రూ.885.65 కోట్ల లాభాన్ని కనబర్చింది. ఆదాయం రూ.3,754.77 కోట్ల నుంచి రూ. 4,335 కోట్లకు చేరినట్టు ఎన్ఎండీసీ తెలిపింది.

# హైదరాబాద్ ప్రాపర్టీ భళా

## అక్టోబర్‌లో 25 శాతం పెరిగిన నివాస రిజిస్ట్రేషన్లు • 5,787యూనిట్లుగా నమోదు.. విలువ రూ.3,170 కోట్లు

## రూ.25-50 లక్షల ఇండ్లకే పెద్ద ఎత్తున గిరాకీ • నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

**స్థిరమైన ప్రభుత్వం, దృఢమైన నాయకత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం. తెలంగాణ రాష్ట్రం ఇందుకు చక్కని ఉదాహరణగా నిలుస్తున్నది.**

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండటంతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ గణనీయంగా విస్తరిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ ప్రాపర్టీకి అంతకంతకూ డిమాండ్ పెరిగిపోతుండగా, ఇక్కడి భూములు కోట్లు పలుకుతున్నాయి.**

**రాష్ట్ర ప్రభుత్వ పాలన, విధానాలు కలిసొస్తుండగా.. వ్యాపార, పారిశ్రామిక రంగాలు రాష్ట్ర రాజధానికి క్యూ కడుతున్నాయి. దీంతో అటు రెసిడెన్షియల్, ఇటు కమర్షియల్ మార్కెట్లలో ఇప్పుడు దేశంలో హైదరాబాదే అందరికీ ఫేవరేటుగా నిలుస్తున్నది. ఇందుకు దేశ, విదేశీ ప్రాపర్టీ కన్సల్టెంట్లు ఇస్తున్న నివేదికలే నిదర్శనం.**

హైదరాబాద్, నవంబర్ 14: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ పరుగులు పెడుతున్నది. ఇక్కడి నివాస గృహాలకున్న డిమాండ్‌కు పెరిగిన రిజిస్ట్రేషన్లే అద్దం పడుతున్నాయి. గత నెల అక్టోబర్‌లో నిరుడుతో పోల్చితే 25 శాతం పెరిగి 5,787 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. విలువ సైతం 41 శాతం ఎగిసి రూ.3,170 కోట్లుగా నమోదైనట్టు ప్రముఖ అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ భారతీయ విభాగం తాజా నివేదికలో వెల్లడించింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో రిజిస్ట్రేషన్లు బాగా జరిగాయి.

**పెద్ద ఇండ్లకే పెద్దపీట**

గతంతో పోల్చితే ఇండ్ల కొనుగోలుదారులు విశాలంగా ఉన్న నివాసాలకే మొగ్గు చూపుతున్నారు. నిరుడు అక్టోబర్‌తో పోల్చితే ఈ ఏడాది అక్టోబర్‌లో 1,000-2,000 చదరపు అడుగులున్న ఇండ్లు 3 శాతం ఎక్కువగా అమ్ముడయ్యాయి. మొత్తం రిజిస్ట్రేషన్లలో 69 శాతానికి చేరాయి. ఇదే సమయంలో 500-1,000 చదరపు అడుగులున్న నివాసాలకు డిమాండ్ 5 శాతం క్షీణించి 16 శాతానికే పరిమితమైంది. 2,000-3,000 చదరపు అడుగులున్న ఇండ్ల రిజిస్ట్రేషన్లూ 2 శాతం ఎగిసి 10 శాతంగా ఉన్నాయి.

**3బీహెచ్‌కేలదే హవా**

ఒక హాల్, బెడ్‌రూం, కిచెన్ ఉండే 1బీహెచ్‌కే ఇండ్లకు గిరాకీ క్రమేణా పడిపోతున్నది. నిరుడు అక్టోబర్‌తో చూస్తే ఈ ఏడాది అక్టోబర్‌లో అమ్మకాలు 2 శాతం నుంచి 1 శాతానికి దిగజారాయి. అలాగే రెండు బెడ్‌రూంలు ఉండే 2బీహెచ్‌కే ఇండ్లకూ డిమాండ్ తగ్గిపోతున్నది. గతంతో పోల్చితే విక్రయాల్లో వీటి వాటా 35 శాతం నుంచి 30 శాతానికి క్షీణించింది. అయితే మూడు బెడ్‌రూంలు గల 3బీహెచ్‌కే నివాసాలకు కొనుగోలుదారుల్లో ఆదరణ పెరిగింది. 56 శాతం నుంచి 58 శాతానికి చేరింది. నాలుగు బెడ్‌రూంలు ఉండే 4బీహెచ్‌కే నివాసాల కొనుగోళ్లూ 5 శాతం నుంచి 7 శాతానికి పెరగడం గమనార్హం. ఇవి 3,000 చదరపు అడుగులకుపైగానే ఉంటుండగా, విలువ రూ.4.5 కోట్లపైనేనని నైట్‌ఫ్రాంక్ చెప్తున్నది.

- ఈ ఏడాది జనవరి-అక్టోబర్ మధ్య హైదరాబాద్‌లో 58,378 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు. గత ఏడాది 56,046కే పరిమితం. 4 శాతం వృద్ధి.
- గత 10 నెలల్లో రూ.30,458 కోట్లకు చేరిన రిజిస్ట్రేషన్ ఇండ్ల విలువ. నిరుడు రూ.27,526 కోట్లే. 11 శాతం పెరిగింది.
- ఈ అక్టోబర్ రిజిస్ట్రేషన్లలో రూ.25 లక్షల లోపు నివాస గృహాల వాటా 16 శాతం. రూ.25-50 లక్షలవి 50 శాతం, రూ.50-75 లక్షలవి 16 శాతం, రూ.75 లక్షలు- కోటి రూపాయలు, కోటి రూపాయలు-రూ.2 కోట్లవి 8 శాతం చొప్పున ఉన్నాయి. రూ.2 కోట్లపైన విలువ కలిగిన నివాస గృహాల రిజిస్ట్రేషన్లు 2 శాతం.
- గత నెల రిజిస్ట్రేషన్లలో 500 చదరపు అడుగులలోపున్న నివాస గృహాల వాటా 3 శాతమే. 500-1,000 చదరపు అడుగులవి 16 శాతంగా, 1,000-2,000 చదరపు అడుగులవి 69 శాతంగా, 2,000-3,000 చదరపు అడుగులవి 10 శాతంగా, 3,000 చదరపు అడుగులకుపైగా ఉన్న నివాస రిజిస్ట్రేషన్లు 2 శాతంగా ఉన్నాయి.
- ఈసారి రిజిస్ట్రేషన్లలో హైదరాబాద్ వాటా 14 శాతంగా ఉంటే, మేడ్చల్-మల్కాజ్‌గిరి 43 శాతం, రంగారెడ్డి 42 శాతం.
- గత నెల టాప్-5 రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి జిల్లా కొండాపూర్ అగ్రస్థానంలో ఉన్నది. 3వేలకుపైగా చదరపు అడుగులకుగాను ఇక్కడి ప్రాపర్టీ మార్కెట్ విలువ గరిష్ఠంగా రూ.5 కోట్ల 27 లక్షల 14,200 పలికింది. తర్వాతి రెండు స్థానాల్లో హైదరాబాద్ జిల్లా బంజారాహిల్స్ ఉండగా, 4, 5 స్థానాల్లో రంగారెడ్డి జిల్లా రాయదుర్గం ఉన్నది. బంజారాహిల్స్‌లో 3 వేలకుపైగా చదరపు అడుగుల స్థలం మార్కెట్ విలువ రూ.5 కోట్ల 16 లక్షల 72,400గా నమోదైంది. అలాగే రాయదుర్గం రెండు లావాదేవీల్లో ఒక దాని మార్కెట్ విలువ రూ.4 కోట్ల 63 లక్షల 07,655గా, మరొకటి రూ.4 కోట్ల 54 లక్షల 22,585గా నమోదయ్యాయి.
- గత నెల రిజిస్ట్రేషన్లలో హైదరాబాద్‌లో సగటున అత్యధికంగా రూ.4,521 పలికిన చదరపు అడుగు. రంగారెడ్డిలో రూ.4,185, మేడ్చల్-మల్కాజ్‌గిరిలో రూ.3,175 పలికాయి. నిరుడు అక్టోబర్‌తో పోల్చితే 6 శాతం చొప్పున పెరుగుదల కనిపించింది.

**ప్రోత్సాహక విధానాలు**

రియల్ ఎస్టేట్ మార్కెట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక దృష్టి ఎంతగానో కలిసొస్తున్నది. స్టార్టప్‌ల దగ్గర్నుంచి బడా కంపెనీ లదాకా ఇప్పుడు అన్నీ హైదరాబాద్‌లోనే కొలువుదీరుతున్నాయి. ముఖ్యంగా ఆయా దేశాల్లోని దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ రెండో అతిపెద్ద కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇక్కడి యువతకు భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తుండగా, వీరిలో చాలామంది ఇక్కడే స్థిర నివాసాలను ఏర్పర్చుకుంటున్నారు. దీంతో ఇండ్ల కొనుగోళ్లు నానాటికీ పెరుగుతూపోతున్నాయని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఇదంతా జరుగుతున్నదని వారు కొనియాడుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు బాగున్నాయని వివరిస్తున్నారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ అంతకంతకూ వృద్ధి చెందుతున్నది. ఇక్కడి ఇండ్లకు అన్నివర్గాల నుంచి భారీగా డిమాండ్ వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు ఆదరణ పెరుగుతుండటం విశేషం. గృహ రుణాలపై వడ్డీరేట్లు స్థిరంగా ఉండటం కూడా కలిసొస్తున్నది. -శిశిర్ బైజాల్, నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ

## సహారా అధినేత సుబ్రతా రాయ్ కన్నుమూత

న్యూఢిల్లీ: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సహారా గ్రూప్ వ్యవస్థాపకుడు సుబ్రతా రాయ్ (75) మంగళవారం ముంబయిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో కన్నుమూశారు. బీహార్‌లోని ఆరారియాలో 1948 జూన్ 10న జన్మించిన సుబ్రతా రాయ్, గోరఖ్‌పూర్‌లోని ప్రభుత్వ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. 1976లో 'సహారా ఫైనాన్స్' పేరుతో చిన్న చిట్ ఫండ్ కంపెనీని స్థాపించారు. ఆ తర్వాత దీనిని 1978లో సహారా పరివార్‌గా మార్చారు. అక్కడ్నుంచి వివిధ రంగాల్లోకి తన వ్యాపారాన్ని విస్తరించారు. ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా, ఆతిథ్యరంగాల్లో సహారా పరివార్‌ను పేరొందిన సంస్థగా తీర్చిదిద్దారు. సహారా ఇండియాలో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై ఆయన మీద పలు కేసులు నమోదయ్యాయి. సెబీ కేసులో కోర్టులో హాజరుకానందుకు ఆయన్ని అరెస్టు చేయాలని సుప్రీంకోర్టు 2014లో ఉత్తర్వులు జారీచేసింది. చివరి రోజులు తీహార్ జైల్లో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత పెరోల్‌పై విడుదలయ్యారు.

## ఆరింతలైన నాట్కో లాభం

హైదరాబాద్, నవంబర్ 14: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ నాట్కో ఫార్మా అంచనాలకు మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.369 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.57 కోట్లతో పోలిస్తే 550 శాతం ఎగబా